క్లుప్తంగా

నేడు స్వచ్ఛత హీ సేవా ర్యాలీ

సామర్లకోట: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక స్టేషన్ సెంటర్ నుంచి గాంధీ చౌక్‌లోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ ఉంటుందన్నారు. ఈ ర్యాలీలో కౌన్సిలర్లు, మున్సిపల్, మెప్మా అధికారులు, సిబ్బంది హాజరు కావాలన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి



పూజలు నిర్వహిస్తున్న యువత

పెద్దాపురం: సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ నాయకులు, గుడివాడ సర్పంచ్ కనపర్తి చీమదొర అన్నారు. మండలంలోని గుడివాడ సాయిబాబా గుడి వీధి సందెమాన్యం వినాయక మంటపం వద్ద సోమవారం భారీ అన్న సంతర్పణ జరిగింది. ఈ సందర్భంగా గణపతి నవరాత్రి ఉత్సవాల కమిటీ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చీమదొర మాట్లాడుతూ, నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. అనంతరం అన్న సమారాధనను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బత్తుల బూరయ్య, బొండ శ్రీను, తోట రాజు, కోన సత్తిబాబు, సిరోదుల గణపతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అధికారులకు శిక్షణ

సామర్లకోట: శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకున్న 11 జిల్లాల్లోని మండల స్థాయి అధికారులకు స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రంలో మంగళవారం నుంచి శిక్షణ ఇస్తున్నట్టు కేంద్రం మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు రెండు బ్యాచ్‌ల్లో పంచాయతీరాజ్ అధికారాలు, విధులపై మూడు రోజుల చొప్పున శిక్షణ ఉంటుందన్నారు. తొలి బ్యాచ్ 17 నుంచి 19 వరకుంటుందని చెప్పారు. ఈ శిక్షణలో ప్రతి జిల్లా నుంచి ముగ్గురు ఎంపీడీఓలు, ముగ్గురు ఈఓపీఆర్డీలు, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు హాజరవుతారని తెలిపారు. 23 నుంచి 25 వరకు జరిగే రెండో బ్యాచ్‌లో ప్రతి జిల్లా నుంచి ఇద్దరు ఎంపీడీఓలు, ఇద్దరు ఈఓపీఆర్డీలు, ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు హాజరవుతారని చెప్పారు. శిక్షణ పొందిన అధికారులు ఆయా జిల్లాల్లోని మండలాల్లో ప్రజాప్రతినిధులు పంచాయతీరాజ్ వ్యవస్థపై శిక్షణ ఇస్తారని వివరించారు.

భారీ అన్నదానం



సామర్లకోటలో జరుగుతున్న అన్నదానం

సామర్లకోట: మాసరమ్మ గుడి సమీపంలోని మట్టపల్లి వారి వీధిలో ఏర్పాటు చేసిన గణపతి శిబిరం వద్ద సోమవారం భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, అయ్యారక కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి ప్రారంభించారు. తొలుత ఆలయంలో స్వామివారికి పూజలు చేశారు. సాయంత్రం ఆలయం నుంచి నిమజ్జన ఊరేగింపు అత్యంత వైభవంగా మొదలైంది. ఆలయ కమిటీ నాయకులు దన్నిన శ్రీహరి, లంక పూర్ణచంద్రశేఖర్, దన్నిన రాజేష్, దుర్గాప్రసాద్, బాబీ, కంచర్ల ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట: పంచారామ క్షేత్రంలోని గోదావరి కాలువ ఇనుప వంతెన వద్ద కాకినాడ రోడ్డులో బస్ షెల్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం ప్రారంభించారు. దాత తలుపుల అంజనీకుమార్ సౌజన్యంతో దీనిని ఏర్పాటు చేశారు. పంచారామ క్షేత్రం గోదావరి కాలువ ఆవలివైపు ఉండటంతో, కాలినడకన వచ్చే భక్తులు బస్సు కాంప్లెక్స్‌కు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. దీనిని గమనించిన దాత.. ఎమ్మెల్యే సూచన మేరకు బస్ షెల్టర్‌ను నిర్మించారు. ఈ బస్ షెల్టర్ వద్ద కాకినాడ వైపు రాకపోకలు సాగించే బస్సులు నిలిపేలా ఆర్టీసీ అధికారులకు సూచనలు ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ భళ్ల నీలకంఠం, ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ కంటే బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి దొరబాబు, మాజీ వైస్ చైర్మన్ యార్లగడ్డ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, కబడ్డీ సంఘ జిల్లా అధ్యక్షుడు బదుగు శ్రీకాంత్, కౌన్సిలర్ బలుసు వాసు తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో నిమజ్జనానికి సిద్ధమైన వినాయక విగ్రహంతో ఉత్సవ నిర్వాహకులు



పిఠాపురంలో నిమజ్జనానికి వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌పై తరలిస్తున్న భక్తులు



కొత్తపల్లిలో గణపతి విగ్రహ ఊరేగింపు



ఉప్పాడ తీరంలో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



ట్రాక్టర్‌పై గణేశ్ భారీ విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

గంగమ్మ ఒడికి గణపయ్య

- జోరుగా వినాయక నిమజ్జనాలు
- భారీ ఊరేగింపులు, భక్తుల కోలాహలం



ఉప్పాడ బీచ్ రోడ్డులో నిమజ్జనం కోసం సముద్రంలోకి విగ్రహాలను తరలిస్తున్న భక్తులు

పిఠాపురం: ప్రత్యేక మంటపాల్లో నవ రాత్రులు పూజలందుకున్న గణపయ్య ఉత్సవాలు పూర్తవ్వడంతో.. గడపదాటి వడివడిగా గంగమ్మ ఒడికి చేరుతున్నాడు. పిఠాపురం నియోజకవర్గంలో రెండు రోజులుగా జోరుగా వినాయక నిమజ్జనాలు చేపట్టారు. సోమవారం భారీగా వినాయక విగ్రహాలను నియోజకవర్గంలోని పిఠాపురం పట్టణం, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలతో పాటు, గొల్లప్రోలు నగర పంచాయతీల్లో నిలిపిన సుమారు 250 మంటపాల్లోని విగ్రహాలను నిమజ్జనాలకు తరలించారు. బాజాభజంత్రీలు, మేళతాళాలు, డీజే పాటలతో హుషారుగా కుర్రకారు కేరింతలు కొడుతూ, భారీ ఊరేగింపులు నిర్వహించారు. విగ్రహాలను ఉప్పాడ సాగర తీరంతో పాటు, పిఠాపురంలో పిఠాపురం బ్రాంచి కెనాల్, గొర్రిఖండి కాలువల్లోను నిమజ్జనాలు చేశారు.

కళకళలాడిన సాగర తీరం

కొత్తపల్లి: గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా ఉప్పాడ, కోనపాపపేట, మూలపేట సాగర తీరం గణనాథుని నిమజ్జనాలతో సోమవారం కళకళలాడింది. సుమారు 400కు పైగా విగ్రహాలను సాగరంలో నిమజ్జనం చేశారు. వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలను ఆచరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిమజ్జనోత్సవాలు జరిగాయి. మండలంలో కొత్తపల్లి, వాకతిప్ప, కొండెవరం, యండపల్లి, కోనపాపపేట తదితర గ్రామాల్లో ఉన్న వినాయక విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పులతో గ్రామాల్లో ఊరేగించారు. ఉప్పాడ తీర ప్రాంతంలో మండలం నుంచే కాకుండా, పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, కిర్లంపూడి తదితర మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి వందలాది విగ్రహాలను లారీలు, ట్రాక్టర్లు, ఆటోలపై ఊరేగింపుగా తీసుకొచ్చి సముద్రంలో నిమజ్జనం చేశారు. తీరంలో గణనాథునికి ప్రత్యేక హారతులిచ్చి, పూజలు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. భక్తుల తాకిడితో బీచ్ రోడ్డు కిక్కిరిసిపోయింది. ఉప్పాడ నుంచి కాకినాడ వరకూ తీరం వెంబడి సందర్శకులతో కిటకిటలాడింది.

ఉత్సాహంగా గణేశ్ నిమజ్జనాలు

సామర్లకోట: నవరాత్రుల్లో పూజలందుకున్న గణనాథుడి నిమజ్జనాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఈ నెల ఏడున గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించగా, ఆదివారంతో ముగిశాయి. ఆదివారం నుంచి నిమజ్జనాల పర్వం ప్రారంభం కాగా, సోమవారం నుంచి జోరందుకుంది. మండలంలో 122 విగ్రహాలను ఏర్పాటు చేసినట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఆయా శిబిరాల వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాలను అలంకరించిన ప్రత్యేక వాహనాలపై ఊరేగింపుగా నిమజ్జనాల ప్రదేశాలకు తరలించారు. డప్పులు, డ్యాన్సులు, బ్యాండ్‌మేళం, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపులతో పట్టణం హోరెత్తింది. పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీల పరిధిలో ఏర్పాటు చేసిన విగ్రహాలను స్థానిక పంచారామ క్షేత్రం వద్ద గోదావరి కాలువ రేవు వద్దకు తెచ్చారు. స్థానిక మాచరమ్మ ఆలయం వద్ద మట్టపల్లి వారి వీధిలో గణేశ్ నిమజ్జన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. 31వ వార్డులో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వేగి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమం జరిగింది. లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని సంఘ అధ్యక్షుడు పబ్బినీడి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిమజ్జనం చేశారు. పీబీ దేవం, జి.మేడపాడు, జి.కొత్తూరు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం, మాధవపట్నం గ్రామాల్లో నెలకొల్పిన విగ్రహాలను ఆయా గ్రామాల గోదావరి కాలువ రేవుల్లో నిమజ్జనాలు చేశారు. వీకే రాయపురం, చంద్రంపాలెం, కాపవరం, నవర గ్రామాల్లోని విగ్రహాలను ఆయా గ్రామాల్లోని ఏలేరు కాలువలో నిమజ్జనాలు చేశారు. సామర్లకోట సీఐ ఎ కృష్ణభగవాన్ పర్యవేక్షణలో క్రైం సీఐ అంకబాబు, ఎస్సై పీవీఆర్ మూర్తి బందోబస్తు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ సిబ్బంది నిమజ్జనాలను పర్యవేక్షించారు.



సామర్లకోట గోదావరి కాలువలో విగ్రహ నిమజ్జనం



సామర్లకోట భాస్కర్‌నగర్‌లో గణపతి నిమజ్జన ఊరేగింపు



సామర్లకోట లారీ ఓనర్స్ సంఘం ఆధ్వర్యంలో..

గ్రంథాలతో సమాజానికి హితం



పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రముఖులు

పెద్దాపురం: సమాజానికి గ్రంథాలు మంచి సందేశాలు ఇస్తాయని వక్తలు అన్నారు. సాహితీ స్రవంతి, ఏనుగు లక్ష్మణకవి సాహిత్య పీఠం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో పుస్తకావిష్కరణలు ఘనంగా జరిగాయి. రచయితలు ఎర్రమిల్లి నాగేశ్వరరావు-తాడిగడప సుబ్బారావు రచించిన ఏకమ్, ఎర్రమిల్లి వెంకట రామ సత్యప్రసాద్ రచించిన అనేకమ్ పుస్తకాలను ప్రముఖ గురు సహస్రావధాని కడిమళ్ల వరప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుంటముక్కుల సత్యవాహని అధ్యక్షతన సభ జరిగింది. వరప్రసాద్ మాట్లాడుతూ అనాదిగా గ్రంథాలు సమాజానికి మంచి సందేశాలను ఇస్తున్నాయని వివరించారు. సాహితీ స్రవంతి కార్యదర్శి కొత్త శివ మాట్లాడుతూ, సామాజిక వికాసానికి సాహిత్యం ఎంతో కృషి చేస్తోందని విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు తాడిగడప వెంకట సుబ్రహ్మణ్యం, రాజేశ్వరి, గురిలింక ధర్మరాజు, ధర్భా వెంకటేశ్వరశర్మ, వివి సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్వామి వారికి ప్రీతైన రోజు కావడంతో స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. తెల్లవారుజామున స్వామి వారికి తొలి అభిషేకం, తొలి పూజలను తిలకించడానికి భక్తులు బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలతోను, ఆలయ కోనేరులోని నీటితోను అభిషేకాలు చేసుకున్నారు. స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులకు ఈఓ భళ్ల నీలకంఠం అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, అళ్లకి రాజ్‌గోపాల్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



మీలాద్ ఉన్ నబీ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పెద్దాపురం: ముస్లింలకు పవిత్రమైన మహా ప్రవక్త మొహమ్మద్(సఅవ) జన్మదిన వేడుకలు 'మీలాద్ ఉన్ నబీ' సోమవారం పెద్దాపురంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కబడ్డీ వీధిలోని మసీదు నుంచి పుర వీధుల్లో ముస్లింలు అగ్రో మాజీ డైరెక్టర్ సయ్యద్ కరీమ్(జానీ), ఇతర ముస్లిం ప్రముఖుల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జానీ మాట్లాడుతూ, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం కోసం మహా ప్రవక్త (సఅవ) ఆశయాలు, బోధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. తొలుత మసీదు అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో కబడ్డీ వీధి, మెయిన్ రోడ్డు, మున్సిపల్ సెంటర్ మీదుగా భారీ ప్రదర్శన నిర్వహించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- తొమ్మిది మంది అరెస్టు
- రూ.2.44 లక్షల నగదు స్వాధీనం

పెద్దాపురం: ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం అర్ధరాత్రి పెద్దాపురం పోలీసులు దాడి చేశారు. పట్టణంలోని ఓ రియల్టర్, ఐరన్ దుకాణ యజమాని, మేస్త్రీగా పేరొందిన ముగ్గురు వ్యక్తుల ఆధ్వర్యంలో స్థానిక వరహాలయ్యపేటలోని ఓ ఇంట్లో పేకాట స్థావరం నిర్వహిస్తున్నట్టు సీఐ టి.క్రాంతికుమార్‌కు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి నిర్వహించారు. సుమారు రూ.9 లక్షల వరకు నగదు దొరికినట్టు, అర్ధరాత్రి కావడంతో రాజీ యత్నాలు జరిగినట్లు సమాచారం. విషయం కాస్తా సోమవారం మధ్యాహ్నానికి గుప్పు మనడంతో, పోలీస్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. రాత్రి జరిగిన దాడుల్లో రూ.2.44 లక్షలు మాత్రమే స్వాధీనం చేసుకున్నామని, ఈ దాడిలో తొమ్మిది మందిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. సీఐ క్రాంతికుమార్‌ను వివరణ కోరగా, దాడులు జరిపిన మాట వాస్తవమని, అంత భారీ నగదు రికవరీ చేసిన మాట అవాస్తవమన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. దాడిలో పట్టణానికి చెందిన రొంగల లోవరాజు, కొల్లి పోతురాజు, దివిలి రంగ, కరక అప్పారావు, కొమ్మేజు మహేష్, మలిరెడ్డి ఈశ్వరరావు, సూరెడ్డి జోసేస్‌రాజు, బోకం లోవరాజు, కరక సురేష్‌ను అరెస్టు చేసినట్టు సీఐ క్రాంతికుమార్, ఎస్సై మౌనిక తెలిపారు.

పోలింగ్ కేంద్రంగా ఎంపీడీఓ కార్యాలయం



అఖిలపక్ష నాయకులతో సమావేశమైన తహసీల్దార్

సామర్లకోట: రానున్న టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎంపీడీఓ కార్యాలయాన్ని పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని అఖిల పక్ష నాయకులు నిర్ణయించినట్టు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర రెడ్డి తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో అఖిల పక్ష నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. గత ఎమెల్సీ ఎన్నికలకు పాత తహసీల్దార్ కార్యాలయం పోలింగ్ కేంద్రంగా ఉపయోగించారని సీపీఐ కార్యదర్శి పెదిరెడ్ల సత్యనారాయణ తెలిపారు. అది అనువుగా లేదని మిగిలిన పార్టీ నాయకులు సూచించడంతో, మండల ప్రజా పరిషత్ భవనంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని అఖిలపక్ష సభ్యుల సూచన మేరకు తీర్మానించారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు పంపుతామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, ఇతర పార్టీల నాయకులు తోటకూర శ్రీను, విత్తనాల వెంకటరమణ, సరోజ్ వాసు, అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధనలు

కొత్తపల్లి: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని మండలంలో పలు గ్రామాల్లో ఉన్న గణపతి ఆలయాల వద్ద సోమవారం భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. ఉప్పాడలో ఉన్న సంపత్ వినాయక ఆలయం, వాకతిప్పలో ఉన్న గణపతి ఆలయం వద్ద అన్న సమారాధనలు జరిగాయి. భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ఏచూరి మృతి తీరని లోటు



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దాపురం: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం తీరని లోటని పార్టీ జిల్లా నాయకులు దువ్వా శేషుబాబ్జి. ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షుడు కొత్తెం కోటి అన్నారు. మండలంలోని దివిలి గ్రామంలో సోమవారం సీఐటీయూ నాయకుడు డి.క్రాంతికుమార్ అధ్యక్షతన ఏచూరి సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా శేషుబాబ్జి, కోటి మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే కమ్యూనిస్టుగా ప్రజా ఉద్యమాల్లో అడుగుపెట్టారన్నారు. పిన్న వయస్సులోనే కేంద్ర కమిటీకి, తర్వాత పొలిట్‌బ్యూరోకు ఎన్నికై, పార్టీ జాతీయ కార్యదర్శి స్థాయికి ఎదిగారన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో కామన్ మినిమం ప్రోగ్రాంలో కీలక పాత్ర పోషించారన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, దాడి బేబీ, మంతెన సత్తిబాబు, కొమ్మిరెడ్డి బుజ్జి, రేలంగి బుజ్జి, పాలాని సత్తిబాబు, గొందేశి రాజా, రేలంగి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి శిక్షా సాగర్ ఫౌండేషన్ అవార్డులు



అవార్డులు అందుకుంటున్న పద్మజ, శ్రీరామచంద్రమూర్తి

కొత్తపల్లి: గుజరాత్ రాష్ట్ర పాటన్‌లో ఉన్న శిక్షాసాగర్ ఫౌండేషన్ ఆదివారం జాతీయ స్థాయిలో ఉపాధ్యాయులకు అవార్డులు అందజేసింది. కొత్తపల్లి జిల్లా పరిషత్ బాలురు పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలు యాళ్ల పద్మజ, మూలపేట జిల్లా పరిషత్ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు నల్లం అయ్యుత రామచంద్రమూర్తికి హేమచంద్రాచార్య శిక్షా సాగర్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేశారు. వీరిని పలువురు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. అవార్డులు అందుకున్న వారిలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

కాకినాడ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్టు కార్పొరేషన్ కమిషనర్ భావన తెలిపారు. సోమవారం జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని సెలవుల కారణంగా మంగళవారం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్, 10.30 నుంచి ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కొనసాగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ ప్రాంతాల్లోని సమస్యలను నగరపాలక సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు.

న్యాయ వ్యవస్థదే కీలక పాత్ర

కాకినాడ రూరల్: ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థదే కీలక పాత్ర అని న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం కార్యక్రమం జరిగింది. తాము చేసే శాసనాలకు ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలని, రాజ్యాంగ విలువలను ప్రభుత్వం ఉల్లంఘిస్తే వాటిని గాడిన పెట్టే బాధ్యత న్యాయ వ్యవస్థకు ఉంటుందన్నారు.

కోలుకోలేని దెబ్బ



సామర్లకోట ఏలేరు కాలువ సమీపంలో ఉప్పువారి సత్రం వద్ద కుళ్లిన వరి పంట



వీకే రాయపురంలో ముంపులోనే ఉన్న పొలాలు



వీకే రాయపురంలో పూడిపోయిన తూటేరు డ్రెయిన్

- రైతులను నిండా ముంచిన ఏలేరు వరద
- గగ్గోలు పెడుతున్న రైతాంగం

సామర్లకోట: ఏలేరు ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన అదనపు జలాల వరద నీటి కారణంగా రైతులకు తీరని నష్టం జరిగింది. వరద నీరు తగ్గడంతో కుళ్లిపోయిన వరి పంట బయటపడింది. సామర్లకోట-పిఠాపురం రోడ్డులో ఏలేరు కాలువ సమీపంలో ఉన్న పంట భూములు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. అదే విధంగా వీకే రాయపురంలో పంట భూములు సోమవారం నాటికి కూడా నీటిలోనే ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎకరానికి రూ.10 వేల నష్ట పరిహారం ప్రకటించడం సరికాదని, నష్ట పరిహారాన్ని ఇంకా పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు అంటున్నారు. రైతులకు పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందజేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం తిరిగి పంటలు వేయడం సాధ్యం కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీకే రాయపురం పంట భూముల్లో ఉన్న నీరు పోవడానికి అవకాశం లేదని చెబుతున్నారు. పొలాల్లో ఉన్న నీరు తూటేరు డ్రెయిన్ మీదుగా సముద్రంలోకి వెళ్లాల్సి ఉండగా, ఈ డ్రెయిన్ పూర్తిగా మూసుకుపోయింది. తమను ఆదుకోకపోతే వ్యవసాయం చేయడం కష్టమని అన్నదాతలు వాపోతున్నారు. అధికారులు రైతుల పంటలను స్వయంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.

నష్ట పరిహారం పెంచాలి



"సామర్లకోట ఉప్పువారి సత్రం వద్ద ఉన్న పంట భూములు సాధారణ రైతులకు చెందినవి. ఈ భూముల్లో వరి పంట పూర్తిగా కుళ్లిపోయింది. ఏలేరు ప్రాజెక్టు నీరు పంటను ముంచి వేసింది. రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి. ఏలేరు కాలువ నీటి కారణంగా వేలాది ఎకరాలకు నష్టం జరిగింది. అధికారులు స్వయంగా పరిశీలించాలి."

– కొదూరి సూరిబాబు, రైతు, సామర్లకోట